సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



రిమ్స్‌లో కార్పొరేట్ వైద్యం

కడప ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో వైద్యసేవలు విస్తృతమయ్యాయి. ఇక్కడికి వస్తున్న రోగులకు విశేష సేవలను అందిస్తున్నారు. - 8లో



ప్రభుత్వ భూమి కబ్జా

అట్లూరు మండలం మాడపూరులో ఐదెకరాల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసేందుకు యత్నించారు. అక్కడికి రెవెన్యూ అధికారులు సోమవారం వెళ్లి పరిశీలించారు. - 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35.3 /17.3

జిల్లాలో సోమవారం 17.3 – 35.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. గాలిలో తేమ మధ్యాహ్నం 26 శాతం మధ్య నమోదైంది.

న్యూస్‌రీల్

స్పందనలో అర్జీల స్వీకరణ



అర్జీలను పరిశీలిస్తున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సిటీ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమం ద్వారా సోమవారం అధికారులు అర్జీలను స్వీకరించారు. కలెక్టరేట్‌లోని సభా భవనంలో స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డీఆర్వో గంగాధర్‌గౌడ్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు యదుభూషణరెడ్డి, ఆనంద్ నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్‌పై పెన్షన్‌దారులకు అవగాహన

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈపీఎఫ్‌పై పెన్షన్‌దారులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజన్, ఈఎస్‌ఐ బ్రాంచ్ మేనేజర్ సోమశేఖర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ హాలులో ఈఎస్‌ఐ నిధి ఆప్ కే నికట్ 2.0పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి మార్చి 3వ తేది వరకు ఈఎస్‌ఐ సెలబ్రేషన్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సువిధ సంఘం నిధి ఆప్ కే నికట్ 2.0పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారుల సమస్యలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు గణపతిరావు, పీవీ చంద్రశేఖర్, సంజీవరెడ్డి, నాగార్జున కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీనం.. ఉపాధి మార్గం

- ఫిష్ ఆంధ్రా మినీ అవుట్‌లెట్స్‌తోపాటు పలు రకాల షాపుల ఏర్పాటుకు చర్యలు
- నిరుద్యోగ యువతకు ఉపాధే లక్ష్యంగా అడుగులు
- కొత్త షాపుల ఏర్పాటుకు ఎస్సీ, ఎస్టీ, మహిళలకు సబ్సిడీ
- ఆసక్తి ఉన్న వారు ముందుకు రావాలని మత్స్యశాఖ పిలుపు



కడపలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా రిటైల్ షాపు

కడప అగ్రికల్చర్: జిల్లాలో చేపల వినియోగాన్ని పెంచి ప్రజలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడంతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దీంతోపాటు ప్రజలకు సరసమైన ధరలతో పరిశుభ్రమైన చేపలను అందుబాటులోకి తెచ్చి బలవర్ధకమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా జిల్లాలో ఫిష్ ఆంధ్రా మినీ రీటైల్ అవుట్‌లెట్స్(మినీ ఫిష్ రిటైల్ షాపులు), ఫిష్ క్యూయోస్క్, లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్లు, ఫిష్ ఆంధ్రా లాంజ్, త్రిచక్ర, నాలుగు చక్రాల ఆటోల యూనిట్లను జిల్లాకు మంజూరు చేసింది. వీటన్నింటిని ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద మంజూరు చేసింది. వీటిని జిల్లాలో ఏర్పాటు చేసేందుకు మత్స్యశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఒక కుటుంబం ఏడాదికి సగటున 8 కిలోల చేపలను మాత్రమే వినియోగిస్తోంది. ఈ వినియోగాన్ని ఏడాదికి 25 నుంచి 30 కిలోల మేర పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జిల్లా వ్యాప్తంగా వీటిని ఏర్పాటు చేసేందుకు పలు రకాల సబ్సిడీలను అందిస్తోంది.

అపరిశుభ్ర ప్రాంతాల్లో ...

జిల్లాలో చాలా చోట్ల డ్రైనేజీల వద్ద, అపరిశుభ్ర ప్రాంతాలలో చేపలను విక్రయిస్తున్నారు. అందులో కూడా కూలింగ్ చేపలు, చెడిపోయిన చేపలను విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటికి ప్రభుత్వం చెక్ పెడుతూ తాజా చేపలు నిరంతరం సరసమైన ధరలకు ప్రజలకు అందుబాటులో ఉండేలా వివిధ రకాల సబ్సిడీలతో మినీ ఫిష్ రీటైల్ షాపులతోపాటు పలు షాపుల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది.

జిల్లాకు 184 అవుట్‌లెట్స్ మంజూరు ..

జిల్లాకు 184 ఫిష్ ఆంధ్రా మినీ అవుట్‌లెట్స్‌ను మంజూరు చేసింది. వీటి ఏర్పాటుకు మత్స్యశాఖతోపాటు డీఆర్‌డీఏ, మెప్మా సహకారం అందిస్తోంది. ఫిష్ ఆంధ్రా మినీ అవుట్‌లెట్స్‌కు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు 18 షాపులను ఏర్పాటు చేశారు. ఇందులో కడపలో మూడు షాపులు, మాధవరం, జమ్మలమడుగు, బ్రాహ్మణపల్లె, నరసాపురం, పోరుమామిళ్ల, తొండ్రివేముల, ఓబన్నపేట, చౌటపల్లె, చిన్నసింగనపల్లె, రేకులకుంట, బెస్తపల్లె, రాచాయపేట, వెలగలూరు, దత్తాపురం గ్రామాలలో షాపులను ఏర్పాటు చేశారు. మరో 38 షాపుల ఏర్పాటుకు నిర్వాహకులు లబ్ధిదారుల వాటా చెల్లించి షాపుల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నారు. మరో 65 మందిని ప్రాథమికంగా గుర్తించారు. వీరందరితో త్వరలో షాపులను ఏర్పాటు చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా మంజూరైన 184 షాపులు ఏర్పాటు చేస్తే చేపలు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండనున్నాయి.

జిల్లాకు 27 ఫిష్ క్యుయోస్క్‌లు మంజూరు

జిల్లాలో ఫిష్ క్యుయోస్క్‌లు 27 మంజూరయ్యాయి. ఇందులో 9 షాపుల ఏర్పాటుకు లబ్ధిదారులను సిద్ధం చేసినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. ఇందులో ఒక యూనిట్ రూ.10 లక్షలు మంజూరు కానుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రూ.6 లక్షలు సబ్సిడీ ఇవ్వగా మరో రూ.4 లక్షలను లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఓసీ, బీసీ, ఇతరులకు రూ.4 లక్షల సబ్సిడీ పోను మిగతా డబ్బులను చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో జిల్లాలో పోరుమామిళ్ల, బి.మఠం, ఖాజీపేట, ప్రొద్దుటూరు, పత్తూరులలో షాపుల ఏర్పాటుకు పరిశీలన చేశారు.



లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్స్

లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్లు జిల్లాకు 10 యూనిట్లను మంజూరు చేశారు. ఇందులో ఒక యూనిట్‌కు ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేయనుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రూ.12 లక్షల సబ్సిడీ పోను రూ.8 లక్షలను లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే జనరల్‌కు సంబంధించి రూ.8 లక్షల సబ్సిడీ పోను మిగతా రూ.12 లక్షలను లబ్ధిదారుల వాటా కింద చెల్లించాల్సి ఉంటుంది.

ఫిష్ ఆంధ్రాలాంజ్

ఫిష్ ఆంధ్రా లాంజ్(రెస్టారెంట్ మోడల్)కు సంబంధించి 2 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో యూనిట్‌కు రూ.50 లక్షలు ఇవ్వనున్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రూ.30 లక్షల సబ్సిడీ పోను రూ.20 లక్షలు లబ్ధిదారుల వాటా కింద చెల్లించాల్సి ఉంటుంది. జనరల్‌కు సంబంధించి రూ.20 లక్షల సబ్సిడీ పోను మిగతా రూ.30 లక్షలు లబ్ధిదారుల వాటా కింద చెల్లించాలి

త్రిచక్ర వాహనాలకు సంబంధించి..

ఆటోకు సంబంధించి త్రి చక్ర వాహనాలు జిల్లాకు 14 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో యూనిట్ ధర రూ.4. 50 లక్షలు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రూ.లక్షా 80 వేలు సబ్సిడీ పోను మిగతా డబ్బులను లబ్ధిదారుల వాటా కింద చెల్లించాలి. అలాగే జనరల్‌కు సంబంధించి రూ.లక్షా 20 వేలు సబ్సిడీ పోను మిగతా డబ్బులను లబ్ధిదారుల వాటా కింద చెల్లించాల్సి ఉంటుంది.

నాలుగు చక్రాల వాహనాలకు...

జిల్లాకు నాలుగు చక్రాల (ఇన్సులేటెడ్) వాహనాలు 8 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో యూనిట్ ధర రూ. 20 లక్షలు ఉంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రూ.12 లక్షలు సబ్సిడీ పోను మిగతా డబ్బులను లబ్ధిదారుల వాటా కింద చెల్లించాల్సి ఉంటుంది. జనరల్‌కు సంబంధించి రూ.8 లక్షలు సబ్సిడీ పోను మిగతా డబ్బులను లబ్ధిదారుల వాటా కింద చెల్లించాలి.

ఆసక్తి ఉన్న వారు ముందుకు రావాలి



మినీ ఫిష్ రిటైల్ షాపులతోపాటు పలు రకాల షాపులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి ఏర్పాటుకు ఆసక్తి ఉన్న వారు ముందుకు రావాలి. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, మహిళలకు ఒక సబ్సిడీ, ఓసీ, బీసీ, ఇతరులకు మరో సబ్సిడీని అందించి ప్రోత్సహిస్తుంది. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కేఎస్‌వీ నాగలింగాచార్యులు, జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్

▸▸సబ్సిడీ వివరాలు ఇలా...



ఫిష్ ఆంధ్రా మినీ అవుట్‌లెట్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.1,75,000 మంజూరు చేయనుంది. ఇందుకు ప్రభుత్వం వారిని ప్రోత్సహిస్తూ రాయితీలను కల్పిస్తోంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రూ.1,05,000 సబ్సిడీ ఇవ్వగా 70 వేల రూపాయలను లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి కూడా బ్యాంకులు రుణాలను ఇవ్వనున్నాయి. ఇందులో వారికి కేటాయించిన కోటా మేరకు ఈ సబ్సిడీ వర్తిస్తుంది. దాని తరువాత ఎవరు షాపులు ఏర్పాటు చేసుకున్నా సబ్సిడీ రాదు. అలాగే ఓసీ, బీసీ, ఇతరులకు యూనిట్ ధర రూ. 1,75,000కు గాను ప్రభుత్వం రూ.70 వేలు సబ్సిడీ ఇవ్వగా మిగతా రూ.1,05,000ను లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుంది.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించండి

జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ విజయరామరాజు



కడప సిటీ : ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విధులు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఈ ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన నోడల్ అధికారులతో జేసీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయికాంత్‌వర్మ, నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌తో కలిసి ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నోడల్ అధికారులందరూ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించి ఎన్నికలు విజయవంతం చేయాలన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో శిక్షణా కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా పీడీలు ఆనంద్‌నాయక్, యదుభూషణరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సమగ్ర శిక్ష పీఓ ప్రభాకర్‌రెడ్డి, ఓఎస్‌డీ రఘునాథ్, ఆర్డీఓలు శ్రీనివాసులు, వెంకట రమణ, వెంకటేశు, ఎన్నికల విభాగం అధికారి శివారెడ్డి,ఏఓ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పురోగతి ఉండాలి

పేదలందరికీ ఇళ్లు నిర్దేశిత లక్ష్య సాధన దిశగా ప్రతి అంశంలోనూ పురోగతి ఉండాలని కలెక్టర్ విజయరామరాజు క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సభా భవనం నుంచి జేసీ సాయికాంత్‌వర్మ, నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, హౌసింగ్ పీడీ కృష్ణయ్యతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పురోగతి, మౌలిక వసతులు తదితర యాక్షన్ ప్లాన్‌తోపాటు అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు వెంకట రమణ, వెంకటేశు, మండల, నియోజకవర్గ, ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

కడప సిటీ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ప్రస్తుత ఎమ్మెల్సీ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటర్ల తుది జాబితా విడుదలైంది. ఈ జాబితాను డీఆర్వో గంగాధర్‌గౌడ్ విడుదల చేసినట్లు ఎన్నికల పర్యవేక్షకులు శివారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 23వ తేది వరకు ఓటర్ల వివరాలను నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

- పట్టభద్రుల ఓటర్లలో పురుషులు 52,246, మహిళలు 29,063, ట్రాన్స్‌జెండర్స్ 8 మంది ఉన్నారు. మొత్తం 81,317 మంది ఉన్నారు.
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు సంబంధించి 7461 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 4390, మహిళలు 3071 మంది ఉన్నారు.

రాష్ట్రంలోనే ఫస్ట్

- గడపగడపకు మన ప్రభుత్వం ప్రొద్దుటూరులో పూర్తి
- 213 రోజుల్లో 93 వేల ఇళ్లు సందర్శన
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల కంటే ముందు ప్రొద్దుటూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేశామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం చివరి రోజు సందర్భంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది మే 16న తన సతీమణి రాచమల్లు రమాదేవి ప్రాతినిథ్యం వహిస్తున్న 26వ వార్డులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, రాజుపాళెం మండలం కొట్టాల గ్రామంలో పూర్తి చేశామన్నారు. మొత్తం 213 రోజుల పాటు మున్సిపాలిటీలోని 41 వార్డులు, 49 గ్రామాల్లో 93 వేల గడపలకు తాను స్వయంగా వెళ్లానని పేర్కొన్నారు. ఎప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్షలు నిర్వహించినా ప్రొద్దుటూరు అగ్రస్థానంలోనే ఉందని, అదే తరహాలో అందరి కంటే ముందు ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. గత పాలకులు కేవలం ఎన్నికల సందర్భంలో మాత్రమే గ్రామాల్లో పర్యటించే వారని, అందుకు భిన్నంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికలకు సంబంధం లేకుండా ప్రతి ఇంటికీ వెళ్లాలని నిర్ణయించిందన్నారు. ఎమ్మెల్యేలతోపాటు అధికారులు పర్యటించి సమస్యలను గుర్తించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యేకంగా జీఓ జారీ చేసిందన్నారు. తన వెంట నడిచిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులతోపాటు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం నియోజకవర్గ పరిధిలోని 82 సచివాలయాలకు 16.40 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

సీఎంతో చర్చించి జగనన్న పల్లె ప్రగతి ప్రారంభిస్తా

నియోజకవర్గానికి సంబంధించి ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో చెప్పుకోదగ్గ సమస్యలు తన దృష్టికి రాలేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డితో పాటు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుల సహకారంతో అన్ని సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి ప్రధానంగా డ్రైనేజీ కాలువలు, విద్యుత్, రోడ్ల సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు. మార్చి నెలలో అసెంబ్లీలో నిర్వహించనున్న బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈ విషయాలన్నింటిపై ముఖ్యమంత్రి జగన్‌తో కలిసి చర్చిస్తానన్నారు. అనంతరం ఏప్రిల్ నెలలో జగనన్న పల్లె ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించి సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయించేందుకు ప్రయత్నిస్తానన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పి.రామసుబ్బారెడ్డి ఏకగ్రీవం

ప్రకటించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ



ఎన్నికల అధికారి నుంచి ఎమ్మెల్సీగా డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న పి.రామసుబ్బారెడ్డి

కడప సిటీ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ సాయికాంత్‌వర్మ సోమవారం ఆయనకు సంబంధిత ధ్రువీకరణ (డిక్లరేషన్) పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు కడప నగర మేయర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పి.రామసుబ్బారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ నాయకులు స్వతంత్ర అభ్యర్థిని బరిలోకి దించేందుకు ప్రయత్నాలు చేసి నామినేషన్ వేయించారు. అయితే నామినేషన్ బలపరిచిన వారి సంతకాలు పరిశీలనలో ఫోర్జరీ అని తేలడంతో స్వతంత్ర అభ్యర్థి రమణయ్య నామినేషన్‌ను జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. ఈ నేపథ్యంలో పి.రామసుబ్బారెడ్డి వేసిన ఒకే ఒక్క నామినేషన్ మిగలడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి డిక్లరేషన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డితోపాటు జమ్మలమడుగు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

చివరి శ్వాస వరకు జగన్‌తోనే ఉంటా

- ఇప్పుడు టీడీపీలో ఉండేది అల్లుళ్లే
- నేను వదిలేసిన ఎమ్మెల్సీ పదవిని దేవగుడి కుటుంబం అనుభవిస్తోంది
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

తన తుదిశ్వాస వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఉంటానని జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. తనపై నమ్మకముంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సోమవారం ఆయన ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయికాంత్ వర్మ చేతుల మీదుగా ఎమ్మెల్సీగా డిక్లరేషన్ ఫారాన్ని అందుకున్న తర్వాత కలెక్టరేట్‌లో నగర మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నేతల సహకారంతో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తనను బలపరిచినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు నిజాయితీగా మాట్లాడాలని హితవు పలికారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి తెలిసి మాట్లాడితే బాగుంటుందన్నారు. ఎన్టీఆర్ హయాంలో తాను కొడుకుగా పార్టీలో సేవ చేశానన్నారు. కానీ ఇప్పుడు చంద్రబాబు హయాంలో జిల్లాలో పని చేస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి, మరి కొంత మంది అల్లుళ్లుగా పని చేస్తున్నారని, ఏమి కష్టపడకుండానే పదవులు అనుభవిస్తున్నారని తెలిపారు. తాను కాదు... ఇప్పుడున్న నేతలు టీడీపీలో అల్లుళ్లలాగా ఉన్నారన్నారు. ప్రలోభాలకు ఎప్పుడూ లొంగలేదన్నారు. తాను వదిలేసిన ఎమ్మెల్సీ పదవిని దేవగుడి కుటుంబం అనుభవిస్తోందన్నారు. తనను అల్లుడిగా టీడీపీ ప్రభుత్వం అప్పట్లో చూసిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దిను టీడీపీలో కొడుకులా పని చేస్తే ఇప్పుడున్న వారు అల్లుళ్లలాగా పని చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పార్టీలో ఉండగా ఎన్నో కష్టాలు పడ్డామన్నారు. నిజాయితీగా అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ కూడా ఉన్న పార్టీలో పని చేస్తానని, ఈ విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. ఆదినారాయణరెడ్డి తమ కుటుంబాన్ని ఎన్నో ఇబ్బందులు పెట్టారన్నారు. టీడీపీలోకి ఆదినారాయణరెడ్డి రాకను ఆనాడు వ్యతిరేకించానని, ఎప్పుడూ రాజీ పడలేదన్నారు. చేయని తప్పునకు హత్య కేసులో ఇరికించారని తెలిపారు.

సామాజిక న్యాయం పాటిస్తున్న సీఎం: మేయర్ సురేష్‌బాబు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా అన్ని విధాలా న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని కడప నగర మేయర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు సురేష్‌బాబు తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థులకు సంబంధించి 18 స్థానాలు ఉండగా 14 స్థానాలకు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలకు కేటాయించారన్నారు. ఇప్పటికే ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయన్నారు. మిగిలిన అన్ని చోట్ల కూడా వైఎస్సార్ సీపీ అభ్యర్థులే విజయకేతనం ఎగుర వేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఆఖరి విడత.. అన్నదాతకు అందజేత

రైతు భరోసా కింద తుది విడతలో విడుదల కానున్న నిధులు

నియోజకవర్గం	రైతుల సంఖ్య	జమ కానున్న నగదు (రూ.కోట్లలో)
బద్వేలు	33835	7.11
జమ్మలమడుగు	37988	7.98
కడప	828	0.17
కమలాపురం	32164	6.75
మైదుకూరు	36495	7.66
ప్రొద్దుటూరు	10778	2.26
పులివెందుల	44475	9.51
ఒంటిమిట్ట	2962	0.62
సిద్దవటం	3073	0.66
మొత్తం	202598	42.73

- నేడు రైతు భరోసా నిధుల విడుదల
- జిల్లాలో 2,02,598 మందికి రూ.42.73 కోట్ల మంజూరు
- ప్రతి ఒక్కరి ఖాతాలోకి రూ.2 వేలు జమ
- ఇన్‌పుట్ సబ్సిడీ రూ.74.75 లక్షలు విడుదల
- ఆనందంలో కర్షకుడు



కడప అగ్రికల్చర్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టారు. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా పంట పెట్టుబడుల కోసం ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఈ ఏడాది (2022–23)కి సంబంధించిన మూడవ (ఆఖరి) విడత ఆర్థిక సాయం రూ. 2 వేలు మంగళవారం విడుదల చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. ఆయన బటన్ నొక్కగానే రాష్ట్ర వ్యాప్తంగా రైతుల ఖాతాలకు నగదు జమ కానుంది. వైఎస్సార్ జిల్లా పరిధిలో 2,02,598 మంది కర్షకులకు రూ.42.73 కోట్లు అందనున్నాయి.

ప్రతి కుటుంబానికి...

ఈ ఏడాది ప్రతి రైతు కుంటుబానికి రైతు భరోసా సాయం రూ.13,500 అందిస్తున్నారు. ఇలా వరుసగా నాలుగో ఏడాదికి సంబంధించి ఖరీఫ్ సాయంగా 2022 మేలో రూ.7500, రబీ సాయంగా అక్టోబర్‌లో రూ.4 వేలు చొప్పున జమ చేశారు. తుది విడతగా రూ.2 వేలు ఇస్తున్నారు.



మాండూస్ తుపాను కారణంగా దెబ్బతిన్న వరి పంట (ఫైల్)

మాండూస్ తుపానుకు సంబంధించి..

గతేడాది డిసెంబర్‌లో మాండూస్ తుపాను కారణంగా జిల్లాలో ఉద్యాన, వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. బద్వేలు, కలసపాడు, బి.కోడూరు, సిద్దవటం, కాశినాయన, చాపాడు, ప్రొద్దుటూరు, మైదుకూరు, ఖాజీపేట, అట్లూరు, సింహాద్రిపురం, చెన్నూరు మండలాల పరిధిలో వరి, మినుము, పత్తి, జొన్నలు, శనగ, పెసలు, మొక్కజొన్న, నువ్వుల పంటలు నాశనమయ్యాయి. 838 మంది రైతులకు 499.57 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది. ఇందుకు పరిహారంగా రూ.75.75 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేయనుంది. ఈ నిధులు కూడా మంగళవారం రైతుల ఖాతాలకు జమ కానున్నాయి.

నేడు కలెక్టరేట్ సభా భవన్‌లో..



రైతు భరోసా ఆఖరి విడతగా రూ.2 వేల పెట్టుబడి సాయం మంగళవారం రైతుల ఖాతాలో జమ కానుంది. దీనికి సంబంధించిన జిల్లా కార్యక్రమాన్ని కడప కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో నిర్వహిస్తున్నాం. ఏర్పాట్లను పూర్తి చేశాం. రైతు భరోసాతోపాటు ఇన్‌పుట్ సబ్సిడీని కూడా రైతులకు అందించనున్నాం.

– అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

కూరగాయల దుకాణంలో రూ.లక్ష మాయం

ఒంటిమిట్ట: మండల కేంద్రమైన ఒంటిమిట్టలో జాతీయ రహదారి పక్కన ఉన్న ప్లాట్ ఫాంపై గల బాలయ్య అనే వ్యక్తి కూరగాయల దుకాణంలో సోమవారం రూ. లక్ష మాయమైనట్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుల కథనం మేరకు... బాలయ్య కడపకు చెందిన కొంత మంది దగ్గర ఫైనాన్స్ తీసుకునే వాడు. ఎప్పటి లాగే సోమవారం కూడా కడపకు చెందిన ఫైనాన్స్ వారు వచ్చి రూ. 1 లక్ష ఇచ్చి వెళ్లారు. అది తీసుకొని ఇంటికి వెళ్లాలని బయలుదేరాడు. ఈలోగా కూరగాయల కోసం జనాలు రావడంతో డబ్బులు టమోటాల ట్రేలో ఉంచాడు. కూరగాయలు విక్రయించిన అనంతరం టమాట ట్రేలో చూస్తే డబ్బులు కనిపించలేదు.వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్‌ఐని వివరణ కోరగా తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి, కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ప్రభుత్వ భూమి కబ్జా



ఆక్రమణకు గురైన భూమిని పరిశీలిస్తున్న వీఆర్‌ఓ

అట్లూరు : మండలంలోని మాడపూరు రెవెన్యూ పొలంలో సర్వే నంబర్ 1039లో సుమారు ఐదెకరాల రస్తా పోరంబోకు భూమిని (ప్రభుత్వభూమి) కబ్జారాయుళ్లు ఆదివారం రాత్రి యంత్రాలతో చదును చేయించి కంచె ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం తహసీల్దారు శ్రీవాణికి ఈ విషయం వెళ్లడంతో ఆమె వీఆర్‌ఓ దస్తగిరి, రెవెన్యూ సహాయకులను ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చూడాలని ఆదేశించింది. సోమవారం వారు వెళ్లేలోగా యంత్రాలతో పాటు కబ్జారాయుళ్లు అక్కడనుంచి జారుకున్నారు. ప్రభుత్వభూమి చుట్టూ చేసిన కంచెకు నిప్పు పెట్టి తగలబెట్టారు.ప్రభుత్వ భూమి ఆక్రమించాలని చూస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రిమ్స్‌లో కార్పొరేట్ వైద్యం

- జిల్లా ప్రజలకు విశేష వైద్య సేవలు
- ఎక్స్‌రే, స్కానింగ్, ఎంఆర్‌ఐ, సీటి స్కాన్ పరీక్షల నిర్వహణ



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రధాన ద్వారం



రిమ్స్‌లో ఓపి విభాగం భవనం

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో వైద్యసేవలు విస్తృతమయ్యాయి. ఇక్కడికి వస్తున్న రోగులకు విశేష సేవలను అందిస్తున్నారు. ఓపీకి రోజూ 1800 మంది నుంచి 2000 మందిదాకా వస్తుంటారు. గతంలో ఎక్స్‌రే, సీటి స్కాన్, స్కానింగ్, ఎంఆర్‌ఐ పరీక్షలను చేయించుకునేందుకు ప్రైవేటు వారిని సంప్రదించాల్సి వచ్చేది. ప్రస్తుతం అలాంటివేమీ లేకుండానే వైద్య సేవలను ప్రాధాన్యత ఉన్న విభాగాల్లో పొందుతున్నారు. గైనిక్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, చిన్నపిల్లల విభాగం, ఎస్ఎన్‌సీయూ, ఆప్తాలమిక్, చర్మవ్యాధుల నివారణ, మానసిక వ్యాధుల నివారణ, ఫిజియోథెరఫీ, డయాలసిస్‌తో పాటు ఇతర విభాగాల్లో వైద్య పరీక్షలను ఓపి, ఐపీ విభాగాల్లో నిర్వహిస్తున్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలను అందిస్తున్నారు.

■ ఐపీ విభాగంలో అత్యవసర పరిస్థితుల్లో క్యాజువాలిటీకి 24/7 పద్ధతిలో వైద్య సేవలను పొందే అవకాశం ఉంది. ఈ విభాగంలోనే అవసరమైన సమయంలో మొబైల్ ఎక్స్‌రేలను కూడా తీస్తున్నారు. కాన్పుల కోసం వచ్చేవారు నేరుగా కాన్పుల విభాగం (లేబర్ వార్డు)లో చేర్పించేందుకు అవకాశం ఉంది. ఐపీ విభాగంలో 750 నుంచి 1000 మంది దాకా వైద్య సేవలు పొందుతున్నారు. ప్రధానంగా కాన్పుల విభాగం, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్ తదితర విభాగాల్లో ఎక్కువ మంది అడ్మిట్ అవుతున్నారు. ఉపశమనం పొంది డిశ్చార్జ్ అవుతున్నారు.

■ సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓలు డాక్టర్ గీత, డాక్టర్ సునీత, డాక్టర్ రాజేశ్వరిలు, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు, అన్ని విభాగా హెచ్‌ఓడిలు, వైద్య సిబ్బందితో కలిసి నిరంతరం రోగుల కష్టనష్టాలను పర్యవేక్షిస్తున్నారు.


■ ఇటీవలి కాలంలో రిమ్స్‌కు వచ్చే ప్రతి రోగికి సంబంధించిన వివరాలను వారి ఆధార్‌కార్డుతో పాటు లింక్ చేసి, ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈ పద్ధతి ద్వారా ఓపీ , ఆధార్ కార్డు నెంబర్‌ను నమోదు చేసుకుంటే ఆ వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు, ఎక్కడి నుంచైనా పరిశీలించి వైద్య సేవలను అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

■ ఓ.పి విభాగంలో వివిధ విభాగాలకు చెందిన వైద్య పరీక్షలను చేయించుకునేందుకు మొదట ఓ పీ.చీటీని తీసుకోవాలి. తరువాత వారు సూచించిన మేరకు ఆయా విభాగాలకు వెళ్లి వైద్యులచేత పరీక్షలను చేయించుకోవాల్సి ఉంటుంది. రోజూ 1800 నుంచి 2000 మందిదాకా రిమ్స్‌కు వచ్చి ఓపి వైద్యసేవలను పొందుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆ తరువాత అవసరమైన వారికి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నారు.

■ రోగులకు ఎప్పటికపుడు వైద్య సేవలతో పాటు మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. నెలసరిగా వాడే మందులను కూడా అవసరమైన వారికి అందజేస్తున్నారు. ప్రధానంగా డయాబెటిక్ (షుగర్ సంబంధిత వ్యాధి), మానసిక సంబంధిత వ్యాధులకు సంబంధించి అవసరమైన మందులను ఇస్తున్నారు.

■ పుట్టిన వారికి జనన ధ్రువీకరణ, మరణించిన వారికి మరణ ధ్రువీకరణ పత్రాలను తగిన ఆధారాలతో వస్తే ఎప్పటికపుడు జారీ చేస్తున్నారు.

■ దివ్యాంగులకు సంబంధించిన సర్టిఫికెట్ల జారీ కూడా ఓపీ, ఐపీ విభాగాల్లో వైద్య పరీక్షలు చేసి అర్హత కలిగిన వారికి, వారికి కేటాయించిన తేదీలలో ప్రధానంగా మంగళ, శుక్రవారాల్లో జారీ చేస్తారు. వీరు అంతకుముందు తమ పరిధిలోని సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని, కేటాయించిన తేదీల్లో, నిర్ణయించిన ఆసుపత్రుల్లో నేరుగా హాజరు కావాల్సి వుంటుంది. ఇంకా రిమ్స్ ఆవరణలోనే క్యాన్సర్, మానసిక వైద్యం, సూపర్ స్పెషాలిటీ సేవలను జిల్లా ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి జరుగుతోంది.



రిమ్స్‌లో ఎంఆర్‌ఐ యంత్రం ద్వారా పరీక్షలు

2022 జనవరి నుంచి డిసెంబర్ దాకా వివిధ విభాగాల్లో ఓపీ, ఐపీ ద్వారా వైద్య సేవలు పొందిన వారి వివరాలు..

వైద్య విభాగం	ఓపీ సేవలు	ఐపీ సేవలు
గైనకాలజీ (కాన్పులు, మహిళల వ్యాధులు)	36,684	663
కాన్పుల విభాగం	--	8569
ఆర్థోపెడిక్	40, 290	1782
కాలిన గాయాలు	--	52
కార్డియాలజీ	--	133
డెంటల్	1161	127
ఈ.ఎన్.టీ	16798	599
ఈఎన్‌టీ (అత్యవసరకేసులు)	--	750
జనరల్ మెడిసిన్	64357	4218
జనరల్ సర్జరీ	21684	3850
చిన్నపిల్లల విభాగం	20377	4809
ఎస్.ఎన్.సీ.యు	--	3868
ఆప్తమాలజీ	16443	1695
లెప్రసీ	129	05
మానసిక వ్యాధుల నివారణ	13587	303
పల్మనరీ మెడిసిన్	3427	578
చర్మవ్యాధుల నివారణ (స్కిన్)	19196	303
ఎంఐసీయు	-	8477
డయాలసీస్	-	7156

ప్రతి ఒక్కరికీ వైద్య సేవలందేలా కృషి



కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కు వచ్చే ప్రతి రోగికి అవసరమైన వైద్య సేవలను అందించేందుకు అందరి సహకారంతో కృషి చేస్తున్నాం. ఓపీ, ఐపీ విభాగాల సేవలను అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. ప్రతి రోగికి సంబంధించిన వివరాలను నమోదు చేస్తున్నాం. తద్వారా ఎక్కడైనా, ఎప్పుడైనా వారి వివరాలను ఆన్‌లైన్‌లో చూసుకుని వైద్య సేవలను, మందులను అందించేందుకు వీలుపడుతుంది. ఏదైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

- డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, అడిషనల్ డీఎంఈ, సూపరింటెండెంట్, ప్రభుత్వసర్వజన ఆసుపత్రి (రిమ్స్), కడప

విడాకులు ఇచ్చినా భార్య వేధిస్తోందని ఫిర్యాదు

చాపాడు : గతంలో తన భార్య అయిన సావిత్రికి విడాకులు ఇచ్చినప్పటికీ తనతో పాటు పెరాలసిస్‌తో బాధపడుతున్న తన తల్లి ఓబుళమ్మను వేధిస్తోందని మండలంలోని గుంతచీపాడు గ్రామానికి చెందిన నేషనలిస్ట్ రైటర్స్ అసోసియేషన్ కార్యదర్శి పెరుగు ఓబులేసు సోమవారం పోలీసులుకు ఫిర్యాదు చేశారు. అమెకు రావాల్సినవన్నీ తీసుకెళ్లిందని అయినప్పటికీ సావిత్ర తన సోదరులైన సుబ్బయ్య, సురేష్, సూర్య, అక్కడ కొడుకైన సతీష్‌లు తాను లేని సమయంలో ఇంటి మీదకు వచ్చి మా అమ్మ ఓబుళమ్మను శారీరంగా వేధించారని ఓబులేసు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చాపాడు పోలీసులు తెలిపారు.

దున్నపోతుతో బెంబేలు



ప్రజలను భయపెడుదున్న దున్నపోతు

తొండూరు : మండల పరిధిలోని సంతకొవ్వూరు గ్రామంలో దున్నపోతు దాటికి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొన్ని రోజులుగా గ్రామవీధుల్లో తిరుగుతూ మనుషులు, చిన్న దున్నపోతులపై దాడి చేసి భయభ్రాంతులకు గురిచేస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. దున్నపోతును మార్చి 19న గ్రామంలో జరిగే గ్రామ దేవరలో అమ్మ వారికి బలి ఇవ్వనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు బండి రామమునిరెడ్డి తెలిపారు. ఈలోపే ఎవరైనా వచ్చి దీనిని తీసుకెళ్లినా ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు.

లారీలు ఢీ: ఇద్దరికి గాయాలు

రామాపురం: రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో సోమవారం రెండు లారీలు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ కొండారెడ్డి కథనం మేరకు వివరాలు రాయచోటి నుండి కడప వెళ్తున్న (టీఎస్ 23 సీఎల్ 0037) జిప్సం లారీని వెనుకవైపు నుంచి వేరుశనగ లోడుతో వెళుతున్న లారీ (ఏపీ03టీఈ9636) ఢీ కొంది. లారీ డ్రైవర్ సురేష్‌కు రెండు కాళ్లు విరిగాయి. క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకుని క్షతగాత్రులను 108లో కడప రిమ్స్‌కు తరలించారు.

లారీ, బైక్ ఢీ: వ్యక్తి మృతి



కమాల్ మృతదేహం

చింతకొమ్మదిన్నె : కడప -రాయచోటి ప్రధాన రహదారిలోని కొత్త రోడ్డు సమీపంలో సోమవారం మధ్యాహ్నం లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో కమాల్ (28) అనే వ్యక్తి మృతి చెందాడు. సీకే దిన్నె ఎస్‌ఐ బి. అరుణ్‌రెడ్డి కథనం మేరకు మండలంలోని పెద్ద కాంపల్లె గ్రామానికి చెందిన కమాల్ పని నిమిత్త కడప వచ్చాడు. పని పూర్తయ్యాక ఇంటికి వెళుతుండగా కొత్త రోడ్డు వద్ద తన ద్విచక్ర వాహనంతో మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో కమాల్ అక్కడిక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారులు ఉన్నారన్నారు.

వాహనం ఢీకొని..

మైదుకూరు : మండలంలోని ముసల్నాయునిపల్లె వద్ద ఆదివారం రాత్రి గూడ్స్ వాహనం ఢీకొని బిక్కి శ్రీను (50) అనే వ్యక్తి మృతి చెందాడు. మైదుకూరు – పోరుమామిళ్ల ప్రధాన రహదారిలో యానాది కాలనీకి చెందిన శ్రీను రోడ్డు దాటుతుండగా గూడ్స్ వాహనం క్యాంపర్ ఢీ కొన్నట్లు పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన అతన్ని తొలుత కడప రిమ్స్‌కు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు అర్బన్ హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

త్రుటితో తప్పిన ప్రమాదం



బస్సు వద్ద వేచి ఉన్న ప్రయాణికులు

కమలాపురం : కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలో మండలంలోని పందిళ్లపల్లె వద్ద ఆర్టీసీ బస్సు స్టీరింగ్ విరిగిపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. సోమవారం కడప నుంచి అనంతపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు మార్గ మధ్యలో మండలంలోని పందిళ్లపల్లె భైరవేశ్వర స్వామి ఆలయం వద్దకు రాగానే స్టీరింగ్ రాడ్ కింది భాగంలో విరిగి పోయింది. అయితే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును రోడ్డు పక్కన ఆపేయడంతో ప్రమాదం తప్పిందని ప్రయాణికులు చెప్పారు.

పొలానికి నిప్పు

- కాలిపోయిన డ్రిప్ పైపులు
- దాదాపు రూ.3లక్షలు నష్టం



పొలంలో మంటలు అదుపు చేస్తున్న ఫైర్ అధికారులు

రాజంపేట రూరల్ : ఆకతాయిల సరదా ఓ రైతు కుటుంబానికి శాపంగా మారింది. మండల పరిధిలోని గుండ్లూరు పంచాయితీలో గల పద్మా చంద్ర భవాని నగర్‌లోని పొలంలో మంటలు చెలరేగి సోమవారం డ్రిప్ పైపులు కాలిపోయాయి. పసుపు పంట అగ్నికి ఆహుతైంది. సర్వే నెంబరులో 276లో 5 ఎకరాల పొలాన్ని రామాంజనేయులు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటున్నాడు.ఆకతాయిలు పొలానికి నిప్పుపెట్టడంతో రూ.3లక్షల మేర నష్టం వాటిల్లిందని రామాంజనేయులు వాపోతున్నాడు. ఫైర్ శాఖ అధికారులు ఆలస్యంగా వచ్చి మంటలు అదుపు చేశారని, సకాలంలో స్పందించి ఉంటే నష్టం తగ్గేదని రైతులు అంటున్నారు.

తల్లిపై కూతురు, అల్లుడు దాడి

మదనపల్లె : ఆస్తి వివాదాల్లో భాగంగా తల్లిపై కూతురు, అల్లుడు దాడికి పాల్పడిన సంఘటన మదనపల్లె మండలంలో సోమవారం జరిగింది. మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ పుంగనూరువాండ్లపల్లెకు చెందిన రమణమ్మ(50) కూలిపనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఈక్రమంలో కొద్దిరోజుల క్రితం తన కుమార్తె లావణ్యకు ఇంటి స్థలం దానంగా రాసి ఇచ్చింది. అయితే ఆ స్థలంతో పాటు రమణమ్మకు ఉన్న మరో స్థలాన్ని కుమార్తె లావణ్య భర్తతో కలిసి ఫోర్జరీ సంతకాలతో డాక్యుమెంట్ తయారుచేసింది. ఈ విషయం తెలుసుకున్న రమణమ్మ సోమవారం కుమార్తె లావణ్య, అల్లుడిని నిలదీసింది. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. ఆవేశానికి గురైన లావణ్య, ఆమె భర్త బాధితురాలు రమణమ్మపై దాడిచేశారు. దాడిలో గాయపడిన రమణమ్మను స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మతి స్థిమితం లేకే వాహనాలకు నిప్పు

- సీఐ వెంటేశ్వర్లు వెల్లడి
- పోలీసుల అదుపులో నిందితుడు

వేంపల్లె : గత నెల 14వ తేదీ నుంచి ఫిబ్రవరి 27వ తేదీ వరకు వరుసగా కార్లు, ద్విచక్ర వాహనాలకు నిప్పు పెడుతుఉన్న ఆగంతకుడిని వేంపల్లె పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు విలేకరులకు వివరాలు వెల్లడించారు.

సోమవారం తెల్లవారు జామున 4.45గంటల ప్రాంతంలో అమ్మవారిశాల ఎదురుగా ఉన్న వీధిలో దొంతు సంతోష్ కారుకు పెట్రోలు పోసి నిప్పు పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు మంటలను అదుపు చేసి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అలాగే సీసీ పుటేజీని పరిశీలించి.. ఒక వ్యక్తి కారుకు పెట్రోలు పోసి నిప్పు పెట్టడం గుర్తించారు. ఆ వ్యక్తి ఎవరు అనేది విచారణ చేయగా.. అదే వీధికి చెందిన ఖాసీంబీ కుమారుడు సిద్ధిఖీ అబిద్ (మతిస్థిమితంలేని వ్యక్తి)గా గుర్తించారు. ఇతను మంచి స్వర్ణకారుడు అని, దుబాయ్ వంటి దేశాలలో పనిచేసి మంచి గుర్తింపు పొందారు. ఇతనికి 15ఏళ్ల క్రితం వివాహమైంది. కుటుంబ సభ్యుల సమస్యల కారణంగా భార్య 10ఏళ్ల క్రితం వదిలేసి వెళ్లిపోయింది. అప్పటి నుంచి అతను మతిస్థిమితం కోల్పోయి అమ్మవారిశాల వెనుకవైపు పొలాల్లో తిరుగుతుండేవాడు. తల్లి ఖాసీంబీ, సోదరుడు ఆటో డ్రైవర్ వలి దగ్గర ఉండేవారు. ఈ నేపథ్యంలో రెండు నెలలుగా కార్లు, ద్విచక్రవాహనాలకు నిప్పు పెడుతుండేవాడు. ఈ ఆగంతకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. వారి సూచనల మేరకు విశాఖపట్టణం మానసిక వైద్య ఆసుపత్రికి తరలించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిరుపాల్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు, కానిస్టేబుల్ ఖాదర్‌వలి పాల్గొన్నారు.

ప్రతి వాహనానికి హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరి



వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ మీరా ప్రసాద్

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రతి వాహనానికి హై సెక్యూరిటీ నంబర్ ప్లేటు తప్పనిసరని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఇ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కడపలో నంబర్ ప్లేట్‌లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు వాహనాదారులు సినిమా హీరోలు, రాజకీయ నాయకుల పేర్లతో నంబర్ పేట్లను వాహనాలను అమర్చుకుంటున్నారన్నారు. అటువంటి వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేస్తామన్నారు. ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్‌ను ధరించాలన్నారు. దాడుల్లో దాదాపు 70 కేసులు నమోదు చేసి జరిమానాలు విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు శివప్రసాద్, ఏఎంవీఐ లక్ష్మీ ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.


13 ఏళ్ల బాలుడికి అరుదైన చికిత్స

- నిమిషానికి 255 గుండె వేగంతో ప్రాణాపాయ స్థితిలో బాలుడు
- కార్డియోవర్షన్ చికిత్సతో కోలుకున్న వైనం

ప్రొద్దుటూరు క్రైం : 13 ఏళ్ల బాలుడు.. 7వ తరగతి చదువుతున్నాడు. ఛాతిలో నొప్పిగా ఉందంటూ కుప్పకూలిపోయాడు. వైద్యుడు అతన్ని పరీక్షించగా గుండె 255 వేగంతో కొట్టుకుంటోంది. బీపీని పరీక్షించగా రికార్డు కాలేదు. దీంతో డాక్టర్ కార్డియోవర్షన్ చేయడంతో బాలుడు పూర్వ స్థితిలోకి వచ్చాడు. వివరాల్లోకి వెళ్లితే.. జమ్మలమడుగుకు చెందిన 13 ఏళ్ల బాలుడు ఛాతి నొప్పి, ఆయాసం, గుండె దడ లక్షణాలతో ఆదివారం ప్రొద్దుటూరులోని లక్ష్యా కార్డియాక్ సెంటర్‌కు వచ్చాడు. గుండె వైద్య నిపుణుడు డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి బాలుడిని పరీక్షించగా గుండె వేగం నిమిషానికి 255 ఉండగా, బీపీ పరీక్షించగా రికార్డు కాని పరిస్థితి నెలకొంది. ఈసీజీ రిపోర్టును బట్టి ఆ బాలుడికి సూప్ర వెంట్రికూలర్ టాకికార్డియా అనే గుండె వేగం, రిథంకి సంబంధించిన జబ్బుగా నిర్ధారించారు. గుండెలో ఉన్న విద్యుత్ ప్రసరణ వ్యవస్థలో లోపాల కారణంగా ఇలాంటి జబ్బులు వస్తాయని డాక్టర్ తెలిపారు. ఈ తరహా జబ్బులు పెద్ద వారిలో సాధారణంగా వస్తాయని, పిల్లల్లో మాత్రం చాలా అరుదుగా కనిపిస్తాయన్నారు. బాలుడికి సాధారణ బీపీ నమోదు కాని విపత్కర పరిస్థితి నెలకొనడం వల్ల గుండె జబ్బుల వైద్య చికిత్స మార్గదర్శకాలను అనుసరించి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కార్డియోవర్షన్ చికిత్స (గుండె షాక్ ట్రీట్‌మెంట్) చేశారు. డిఫిబ్రిలేటర్‌తో గుండెకి 30 జౌల్స్ షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వడంతో బాలుడికి గుండె వేగం పెరిగి, బీపీ సాధారణ స్థాయికి వచ్చింది. ప్రాణాపాయ స్థితిలో నుంచి బాలుడు బయట పడటంలో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. డాక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



బాలుడిని పరీక్షిస్తున్న డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి



బాలుడికి తీసిన ఈసీజీలో మారిన గుండె వేగం